మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట



# అత్తాకోడళ్లలో పైచేయి ఎవరిది..!



**ధన్వాడ,డిసెంబరు 13 ప్రభాతవార్త:**ధన్వాడ సర్పంచ్ పోరు– కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ నారాయణపేట జిల్లాలోని ధన్వాడగ్రామం ఈసారి సర్పంచ్ ఎన్నికలతో రాజకీయంగా హాట్‌టాపిక్‌గా మారింది. కారణం..రాష్ట్ర రాజకీయాల్లో కీలకమైన అత్తాకోడళ్ల పోటీ ఇక్కడే నేరుగా ప్రతిబింబించడం. పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి(కాంగ్రెస్),పాలమూరు ఎంపీ డీకే అరుణ (బీజేపీ) –ఈఇద్దరు అత్తాకోడళ్ల స్వగ్రామమే ధన్వాడ.సహజంగానే ఇక్కడి సర్పంచ్ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. 8,327ఓట్లు ఉన్న ఈగ్రామంలోకాంగ్రెస్ నుంచి సి.జ్యోతి, బీజేపీ నుంచి పి.జ్యోతి బరిలో నిలవగా,బీఆర్ఎస్ అభ్యర్థి శ్రీదేవి కూడా త్రిముఖపోరుకు తెరతీశారు. గ్రామాభివృద్ధి,సంక్షేమపథకాలు,గతపాలన అంశాలపై ప్రచారం సాగినా..చివరికి ఈఎన్నిక పార్టీల కంటే అత్తాకోడళ్ల పరువుపై నిలిచిందనే చర్చ గ్రామమంతా వినిపిస్తోంది.కాంగ్రెస్ ఎమ్మెల్యే పర్ణికారెడ్డి తన నియోజకవర్గంలో పట్టును నిలుపుకుంటుందా? లేదా ఎంపీ డీకే అరుణ ప్రభావంతో బీజేపీ జెండా ఎగరవేస్తుందా? లేదా మూడో శక్తిగా బీఆర్ఎస్ షాక్ ఇస్తుందా? ఈ ప్రశ్నలకు సమాధానం రేపు మధ్యాహ్నం వెలువడనుంది. ధన్వాడ తీర్పు.. పాలమూరు రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీస్తుందా? లేదా అత్తాకోడళ్ల మధ్య ఎవరిది పై చేయో స్పష్టంగా తేల్చేస్తుందా? అన్నది వేచి చూడాల్సిందే.



జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల ఆవరణలో పి ఓ, ఓపిఓలకు సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్

# అధికారులు ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా ఎన్నికల అథారిటీ, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**అమరచింత డిసెంబర్ 13, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలో నిర్వహించి ఉన్న రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛయుత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అథారిటీ, జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి అధికారులకు సూచించారు. శనివారం అమరచింత మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా కలెక్టర్, ఆదర్శ సురభి మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పి ఓ, ఓ పి ఓ లు తప్పకుండా పాటించి పోలింగ్ కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అలాగే ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమకు నచ్చిన అభ్యర్థులకు ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. అలాగే అమరచింత మండలంలో 12 గ్రామపంచాయతీ సర్పంచులు, 94 వార్డ్ మెంబర్లకు ఆదివారం ఎన్నికలు నిర్వహించేందుకు పోలింగ్ సిబ్బంది ఎన్నికలకు సంబంధించిన మెటీరియల్, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లను అధికారులు తీసుకొని కేటాయించిన గ్రామపంచాయతీ లకు పోలీస్ బందోబస్తు మధ్య బస్సుల్లో తరలించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు మల్లయ్య, జిల్లా అదనపు కలెక్టర్, యాదయ్య, అదనపు కలెక్టర్, కిమ్యా నాయక్, తహసిల్దార్ రవికుమార్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎం పి ఓ నరసింహులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్

# ఎన్నికల పోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలి

**కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కేంద్రాల పరిశీలన**

**నారాయణపేట, డిసెంబరు 13 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం నారాయణపేట, దామరగిద్ద,ధన్వాడ,మరికల్ మండలాలపరిధిలోని గ్రామాల్లో పోలింగ్ జరగనున్న నేపథ్యంలో శనివారం ఆమె పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్/రిసెప్షన్ కేంద్రాలను పరిశీలించారు.డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోని కౌంటర్లు, ఏర్పాట్లను కలెక్టర్ పర్యవేక్షించారు. ఎన్నికల సామాగ్రిని చెక్‌లిస్ట్ ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా బ్యాలెట్ పేపర్లు,బ్యాలెట్‌బాక్స్‌లను ఒకటికి రెండుసార్లు పరిశీలించాలని ఆదేశించారు. మొదటి విడతను విజయవంతంగా నిర్వహించిన విధంగానే రెండో విడతను కూడా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే జోనల్, రూట్ అధికారులకు తెలియజేయాలన్నారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ పర్యవేక్షణ ఉండే అవకాశమున్నందున పోలింగ్ కేంద్రాల్లోని కెమెరాలను ఆఫ్ చేయరాదని స్పష్టం చేశారు.పోలింగ్ కేంద్రాల లోపలికి పోలీసులు వెళ్లకుండా కేంద్రాలఆవరణలోనే బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. ఆదివారం ఉదయం7గంటలకు పోలింగ్ ప్రారంభించి మధ్యాహ్నం 2 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టాలని తెలిపారు. లెక్కింపు పూర్తైన అనంతరం అబ్జర్వర్ ఆదేశాల మేరకే ఫలితాలను ప్రకటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

# 20వేల మందికి శిక్షణ అందిస్తాం

- స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం
- యువతకు ఆధునిక సాంకేతిక నైపుణ్యమందిస్తాం
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్13,ప్రభాతవార్త :** మహబూబ్ నగర్‌లోని బోయపల్లి గేట్, మోతి మసీదు సమీపంలో అధునాతన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయించి, యువతకు నైపుణ్య శిక్షణ అందించి, వారికి ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి చేస్తామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మోతి మజీద్ దగ్గర ఎమ్మెల్యే స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నిర్మాణానికి మైనారిటీ ఫండ్ 50 లక్షల రూపాయలను మంజూరు చేయించుకున్నామని ఆయన వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా నైపుణ్య ఉన్న సిబ్బంది కొరత ఉన్న నేపథ్యంలో, మహబూబ్ నగర్ యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యాలను అందించే దిశగా మరిన్ని స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాబోయే 10 సంవత్సరాల్లో కనీసం 20 వేల మందికి నైపుణ్య శిక్షణ అందించడం తమ –మిగతా2లో..





## రెండో విడుతకు

# సర్వం సిద్ధం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సెకండ్ ఫేజ్‌కు సన్నద్ధం
- ఏకగ్రీవాలు మినహా మిగతా పంచాయతీల్లో ఎన్నికలు
- మధ్యాహ్నం 2తర్వాత కౌంటింగ్
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే పోటాపోటీ



సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్ విజయేంద్రబోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 13,ప్రభాతవార్త :** పంచాయతీ ఎన్నికల రెండో విడుతకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. శుక్రవారం సాయంత్రం 5గంటల నుంచి ప్రచారానికి తెరపడగా, నేటి ఉదయం 7గంటల నుంచి 1గంట వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగనున్నది. ఇదే రోజు మధ్యాహ్నం 2గంటల తర్వాత కౌంటింగ్ ప్రక్రియ కూడా నిర్వహించి సాయంత్రంలోగా ఫలితాలు వెల్లడించనున్నారు. ఈమేరకు అధికారులు పకడ్బంది ఏర్పాట్లు చేశారు. మద్యం పంపిణీపై అధికారులు ప్రత్యేక నిఘా పెంచారు. ఎక్కడా కూడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్పీల ఆధ్వర్యంలో పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకున్నది. సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా వ్యవస్థను పెంచారు. నేడు ఎన్నికలు జరుగుతున్న మండలాల్లో విద్యాశాఖ పాఠశాలలకు సెలవులు ప్రకటించగా, నేటి సాయంత్రం వరకు మద్యం దుకాణాలు సైతం మూసివేయనున్నారు.

**రెండో విడుత ఎన్నికలు జరిగే పంచాయితీల వివరాలు..**

| జిల్లా | గ్రామ పంచాయతీలు | ఏకగ్రీవాలు | ఎన్నికలు జరిగేవి | పోలింగ్ కేంద్రాలు |
|---|---|---|---|---|
| మహబూబ్‌గర్ | 151 | 09 | 142 | 255 |
| నాగర్‌కర్నూల్ | 151 | 04 | 147 | 263 |
| వనపర్తి | 94 | 05 | 89 | 702 |
| జోగులాంబ గద్వాల | 74 | 18 | 56 | 567 |
| నారాయణపేట | 95 | 10 | 85 | 828 |

### కాంగ్రెస్ డీలా..

మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్ అంతర్ మదనంలో పడినట్లు తెలుస్తున్నది. కాంగ్రెస్ పార్టీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడమే ఎందుకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. అయితే గ్రామాల్లో ఒకరికి మించి ఇద్దరు ముగ్గురు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థులు ఉండడం రెబెల్స్ బరిలో దిగడంతో ఫలితాలు తారుమారు అయినట్లు తెలుస్తున్నది. ఇదిలా ఉండగా బి ఆర్ ఎస్ మాత్రం పంచాయతీ ఎన్నికల్లో దూకుడు పెంచింది. ముఖ్యంగా జడ్చర్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మించి సగానికంటే ఎక్కువ సీట్లలో సర్పంచి స్థానాలు గెలుపొందడం ఎందుకు ప్రధాన ఉదాహరణగా చెప్పవచ్చు.
ఉమ్మడి జిల్లాలో 550జీపీలకు ఎన్నికలు జరుగగా 330స్థానాల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందగా, 150స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు, 21స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించినట్లు తెలిసింది. దాదాపు సగం స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రానందునా శ్రేణులు నిరాశలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఎక్కడైనా అధికారంలో ఉన్న పార్టీ అభ్యర్థులు సుమారు 80శాతం వరకు పంచాయతీల్లో రాణిస్తారు. ఉమ్మడి పాలమూరులో అలా జరగకపోవడంతో –మిగతా4లో..

# పేదల వైద్యానికి ప్రాధాన్యం

- ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతమే లక్ష్యం
- అందరికీ ఒకే రకమైన వైద్య సేవలు అందిస్తాం
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- ప్రభుత్వ జనరల్ దవాఖానలో యెన్నం హెల్త్ కిట్ పంపిణీ



కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్13,ప్రభాతవార్త :** పేద ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉండే వైద్య సేవలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులే పేదల పాలిట నమ్మకమైన ఆశ్రయంగా మారాలన్న దిశగా తమ ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. మహబూబ్ నగర్ నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆయన సందర్శించి, మహబూబ్ నగర్ నియోజకవర్గానికి చెందిన నవజాత శిశువుల తల్లులకు ప్రత్యేకంగా రూపొందించిన యెన్నం హెల్త్ కిట్‌లను పంపిణీ చేశారు. ప్రసవానంతరం తల్లులు, శిశువులకు అవసరమయ్యే కీలక వస్తువులు ఈ హెల్త్ కిట్‌లలో పొందుపరిచినట్లు తెలిపారు. తల్లి–శిశు ఆరోగ్య పరిరక్షణే సమాజ భవిష్యత్తుకు పునాది అని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, చికిత్స విధానాలు, సిబ్బంది పనితీరును ఆయన సమీక్షించారు. వైద్యులు, నర్సులు, సిబ్బంది సేవలను అభినందిస్తూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర చికిత్సలు, మందుల లభ్యత, పరీక్షల నిర్వహణ వంటి అంశాలపై ఆర్ఎంఓ డాక్టర్ శ్వేత , డాక్టర్ అర్చనతో చర్చించారు. ఆసుపత్రిలో వైద్య పరికరాల కొరత లేకుండా అవసరమైన అన్ని పరికరాల జాబితాను సిద్ధం చేసి, వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ప్రభుత్వ సహకారంతో పాటు తనవంతు ప్రయత్నాలతో కూడా ఆసుపత్రి అభివృద్ధికి నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్ –మిగతా4లో..



గెలుపొందిన సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

# బీఆర్ఎస్ పాలనలో గ్రామ పంచాయతీలు నిర్వీర్యం

**పదేళ్లలో ఎంతోమంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారు**

**నూతన సర్పంచులు గ్రామాల సర్వతో ముఖాభివృద్ధి సాధించేలా కృషి చేయాలి : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి ప్రతినిధి, డిసెంబరు 13 ప్రభాతవార్త:** పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో గ్రామాలన్ని నిర్వీర్యం అయిపోయాయని, ఎందరో సర్పంచులు అప్పుల బాధలు తాళలేక ఆత్మహత్యలు చేసుకున్న ఉదంతాలు ఎన్నో ఉన్నాయని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శనివారం వనపర్తి పట్టణంలోని తన నివాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్పంచుల సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి పేర అధినాయకులు అందిన కాడికి దోచుకొని గ్రామస్థాయిలోని సర్పంచులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ప్రభుత్వ పరమైన ఇబ్బందులను తట్టుకోలేక చేసిన అప్పులు తీర్చుకోలేక ఎందరో సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన విమర్శించారు. సర్పంచుల ఆత్మహత్యలకు పరోక్షంగా కారణమైన నాయకులు నేడు నిస్సిగ్గుగా గ్రామాల అభివృద్ధి గురించి మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. పదేళ్ల నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడితే ఎమ్మెల్యే ఎన్నికల్లో ఎందుకు ఓడిపోయారని ఆయన ప్రశ్నించారు.. తెలంగాణ సెంటిమెంట్ ఉధృతంగా ఉన్ననాడే ఓడిపోయిన వ్యక్తివి ఎందరో నాయకుల శ్రమ ఫలితంగా గెలిచి ఒక్కసారి పదవిలో ఉండి వందేళ్ళ సంపాదన సంపాదించుకున్న నీకు గ్రామాల అభివృద్ధి గురించి మాట్లాడి నైతిక హక్కు లేదన్నారు. అవినీతి మహావృక్షంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూకటి వేళ్ళతో పెకిలిస్తుందని ఈ సర్పంచ్ ఎన్నికలు నిరూపిస్తున్నాయి అన్నారు. ఈ సందర్భంగా ఆయన పెద్దమందడి, గోపాల్‌పేట,రేవల్లి, ఖిల్లా ఘణపురం, ఏదుల మండలాలకు చెందిన పలువురు సర్పంచులను శాలువాలతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ బాక్స్ ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ విజయేంద్రబోయి

# ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

**ఎక్కడ పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలి : జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి**

**చిన్న చింతకుంట, డిసెంబరు 13 ప్రభాతవార్త :** రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పంపిణీ చేస్తున్న పోలింగ్ మెటీరియల్ పంపిణీ, భోజనం ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న చింతకుంట మండలంలోనీ 18 గ్రామ పంచాయతీలకు రెండవ విడత ఎన్నికలు నిర్వహణలో భాగంగా ఆదివారం ఉదయం7గంటల నుంచి మధ్యాహ్నం –మిగతా2లో..

# అమలు కానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ

**ప్రజల అమాయకత్వాన్ని సొమ్ము చేసుకోవడంలో కాంగ్రెస్ ముందుంటుంది**

**ఎన్నికల సిబ్బంది నిస్పక్షపాతంగా వ్యవహరించాలి**

**పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలకు నాయకులకు కృతజ్ఞతలు తెలియజేసిన మాజీ మంత్రి**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి

**వనపర్తి,డిసెంబరు 13 ప్రభాతవార్త:** హామీలు అమలు చేస్తే ఎప్పుడో ఎన్నికలు పెట్టేవారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజల అమాయకత్వాన్ని సొమ్ము చేసుకోవడంలో కాంగ్రెస్ పార్టీ ముందు వుంటుందని హామీలు అమలు చేయడం సాధ్యం కాదన్న విషయం వాళ్లకు తెలుసు కానీ ఎన్నికల్లో లబ్ధి కోసం సీఎం, డిప్యూటీ సీఎం పెద్ద పెద్ద మాటలు మాట్లాడారు. ఇవాళ హామీల అమలు సమయం వచ్చేసరికి ఎవరూ మాట్లాడట్లేదని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 700 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. అరవై మంది గురుకులాల్లో చదివే విద్యార్థులు మృతి చెందారని చేనేత కార్మికులు ఆత్మహత్య లకు పాల్పడుతున్నారు. ప్రభుత్వానికి ఇవేమీ పట్టవా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్ర ఉద్యోగుల కంటే ఎక్కువ జీతం కేసీఆర్ ఇచ్చారని గుర్తు చేశారు. రెండేళ్ల నుండి రిటైర్మెంట్ బెనిఫిట్ లు ప్రభుత్వం అందజేయట్లేదని ప్రభుత్వానికి లేఖ రాసి ఆత్మహత్య చేసుకుంటున్నారు. రాష్ట్ర రైతాంగం రోడ్డెక్కింది. బోనస్, కరెంట్, నీళ్ళు,వడ్ల కొనుగోలు, రైతు బంధు, యూరియా కోసం రైతులను ఇబ్బంది పెట్టింది. యాసంగి స్టార్ట్ అయింది. రైతు బంధు ఇస్తారో ఇవ్వరో చెప్పడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒకటే సీజన్ లో రైతు బంధు వేసింది. సీఎం పర్యటనలు చేసి గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం ప్రచారం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చినపుడు అధికార పార్టీ అభ్యర్థులు గెలవడం సహజంగా జరుగుతుంది. ప్రజల మన్ననలు పొందితే అధికార పార్టీకి అనుకూలంగా తీర్పు వస్తుంది. ఎంత అధికార దుర్వినియోగం చేసిన బిఆర్ఎస్ వైపు ప్రజలు మొగ్గు చూపారని అన్నారు. కొంతమంది అధికారులు ఉద్దేశ్యపూర్వకంగా తప్పు చేశారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరించాలని తెలిపారు. బీ ఆర్ ఎస్ బలపరిచిన అభ్యర్థులు చాలా చోట్ల ఏకగ్రీవం అయ్యారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నపుడు ప్రతి నియోజకవర్గంలో సర్పంచ్ స్థానాలు ఐదు నుండి పది శాతానికి మించి ప్రతిపక్షానికి రాలేదు. మీ పరిపాలన మీద నమ్మకం ఉంటే కాంగ్రెస్ తక్షణం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టాలి. తెలంగాణ రాష్ట్రం విధ్వంసం అయిపోయిందని సీఎం,మంత్రులు మాట్లాడుతున్నారు.60వేలకోట్ల అప్పుతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పరిపాలన మొదలైంది.కేసీఆర్ దిగిపోయేనాటికి మూడు లక్షల ఇరవై ఐదు వేల కోట్లు అని పార్లమెంటు లో కేంద్రం ప్రకటించిందని గుర్తు చేశారు. ఈ విషయాన్ని రాష్ట్రం సాధించిన ప్రగతి పై కేంద్రం నివేదిక ఇస్తుందని తెలిపారు.తెలంగాణ కు కేంద్రం ఇచ్చిన అవార్డ్ లే కేసీఆర్ పాలనకు నిదర్శనం అని తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సమ్మిట్ లో చాలా మంది తెలంగాణ అభివృద్ధిని కొనియాడారన్నారు. కాంగ్రెస్ తెలంగాణ ప్రజల నమ్మకాన్ని కోల్పోయింది. మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఇచ్చిన తీర్పుకు ధన్యవాదాలు..ఇదే విధంగా రెండు మూడు విడతల్లో ఆశీర్వదించాలని ప్రజలను ఆయన కోరారు. పార్టీ కోసం కష్ట పడుతున్న నాయకులు, కార్యకర్తలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ , అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, జిల్లా రైతు సమితి మాజీ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, మాజీ ఎంపిపి కృష్ణా నాయక్, చంద్రశేఖర్ నాయక్, వేణుగోపాల్, మాజీ కౌన్సిలర్‌లు నాగన్న యాదవ్, ప్రేమ్ నాథ్ రెడ్డి, గులాం ఖాదర్ ఖాన్, ఇమ్రాన్, బొబ్బిలి ప్రేమ్ కుమార్, సయ్యద్ జమీల్, నందిమల్ల సుబ్బు, మంద రాము, సూర్యవంశం మునికుమార్, నీలస్వామి,పెద్ద ముక్కల రవి, జె.శ్రీనివాసులు, అలీమ్, నవాజ్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

## జనరల్ స్థానాల్లో బీసీలను గెలిపించండి

**బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ సాగర్**

**మహబూబ్‌నగర్, డిసెంబర్13,ప్రభాతవార్త:** రెండో దశ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు అత్యధిక స్థానాలలో గెలిపించాలని జనరల్ స్థానాలలో మొదటి విడత ఎన్నికల్లో ఏ విధంగా అయితే అత్యధిక స్థానాలు గెలిచారో అదే విధంగా ఈ విడతలో కూడా అత్యధికంగా సర్పంచులుగా గెలిచి బీసీల సత్తా ఏంటో నిరూపించాలని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు మోడల శ్రీనివాస్ సాగర్ ఒక ప్రకటనలో కోరారు..అన్ని పార్టీలకు బీసీల పట్ల చిత్తశుద్ధి లేదు కాబట్టి 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించి మోసం చేసిన ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలని, భవిష్యత్తులో జరగబోవు ఎంపీటీసీ ,జెడ్పిటిసి, మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో బీసీలకు అత్యధిక సీట్లు ఇచ్చే విధంగా ఈ ఎన్నికల్లో మన బలం నిరూపించుకోవాలని తెలిపారు.బీసీ వాదం ఉన్న వ్యక్తిని, అగ్రవర్ణాల ప్రోత్సాహం లేకుండా ఉన్న వారిని గెలిపించుకుంటే భవిష్యత్తు బీసీ ఉద్యమంలో రాజకీయంగా ముందుకు పోయేందుకు ఇప్పుడు గెలిచే సర్పంచులకు మంచి అవకాశమన్నారు. తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చే ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ లందరూ చైతన్యంతో ఆత్మగౌరవ ఉద్యమంగా భావించి మన ఓట్లు మనకే వేసుకుని ఎక్కువ మందిని గెలిపించుకోవాలని శ్రీనివాస్ సాగర్ కోరారు.

## ఎన్నికల సామగ్రి సిద్ధం



ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ వరుణ్ తేజ

**ఉప్పునుంతల, డిసెంబరు 13 ప్రభాతవార్త :** ఈనెల 17న జరుగు గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన సామాగ్రిని సహాయ జిల్లాఎన్నికల అధికారి, ఎంపిడిఓ వరుణ్ తేజ ఆధ్వర్యంలో సిద్ధం చేశారు. మండలంలో 26 గ్రామ పంచాయతీలకు గాను రాష్ట్ర ఎన్నికల కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు సర్వం సిద్ధం చేశారు. శనివారం ఎన్నికల సామాగ్రిని సహాయ జిల్లా ఎన్నికల అధికారి, ఎంపిడిఓ వరుణ్ తేజ పరిశీలించారు. సామాగ్రి ఎన్నికల సిబ్బందికి సరిపడ మెటీరియల్ అందజేసేందుకు ఒకటి రెండు సార్లు పరిశీలించారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో అధికారులు అప్రమత్తంగా ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిద్ధంగా ఉన్నారు. పరిశీలించిన వారిలో సహయ జిల్లా ఎన్నికల అధికారి, ఎంపిడిఓ వరుణ్ తేజ, మాస్టర్ ట్రైనర్ అజ్మతుల్లా, ఎంపిడిఓ కార్యాలయం సూపరింటెండెంట్ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి చందర్ లాల్ , సిబ్బంది సాలార్, సాయి, సింగోటం తదితరులు ఉన్నారు.

## గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించే బాధ్యత సర్పంచులదే



నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

**వెల్దండ,డిసెంబర్ 13 ప్రభాతవార్త:** గ్రామ మొదటి పౌరులుగా గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించే కీలక బాధ్యత సర్పంచులదేనని, ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా అండగా ఉండి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుకుందామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. వెల్దండ మండల కేంద్రానికి చెందిన సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, బొల్లంపల్లి సర్పంచ్ సత్తూరి ప్రసాద్ గౌడ్, వెల్దండ ఉప సర్పంచ్ శ్రీనివాస్ ముదిరాజును ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో అత్యధికంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచ్ అభ్యర్థులు గెలుపొందారని, గ్రామాలను వేగవంతంగా అభివృద్ధి పరుస్తామన్నారు.ఈకార్యక్రమంలో వెల్దండ గ్రామమాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి,ఆర్యవైశ్య మహాసభ జిల్లాఅధ్యక్షులు బచ్చు రామకృష్ణ,మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్,నాయకులు వెంకట్ రెడ్డి, రమాకాంత్ రెడ్డి, బ్రహ్మాచారి, నిరంజన్‌గౌడ్, కృష్ణ, పుల్లయ్య, మదన్ గౌడ్,విష్ణుగౌడ్,వెంకటేష్, బాబా, మదన్‌గౌడ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పరిశీలన



పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకురాలు కాత్యాయినీదేవి

**మహబూబ్‌నగర్, డిసెంబర్13,ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ రెండవ విడత ఎన్నికలు నిర్వహించనున్న మిడ్జిల్ మండలంలో ఎం.పి.డి.ఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను సందర్శించి పోలింగ్ సామాగ్రి ఏర్పాట్లను గ్రామ పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకురాలు కాత్యాయని దేవి పరిశీలించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పోలింగ్ సామాగ్రి పంపిణీ ఏర్పాట్లు సాధారణ పరిశీలకురాలు కు వివరించారు.

## పది విద్యార్థులకు ఫ్రీ స్కాలర్ షిప్ టెస్ట్..



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 13 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో విద్యా మందిర్ క్లాసెస్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో డిసెంబర్ 20న 10వ తరగతి విద్యార్థులకు ఫ్రీ స్కాలర్ షిప్ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ గౌతమిరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ పరీక్షను నిర్వహిస్తుండగా ఇందులో మెరిట్ సాధించిన వారికి ఐఐటీ, జేఈఈ, నీట్, ఫౌండేషన్ విద్యను ఉచితంగా అందించనున్నట్లు వివరించారు. మరో వంద మంది విద్యార్థులకు 40 శాతం స్కాలర్‌షిప్ ను అందిస్తామన్నారు. వివరాల కోసం సంస్థ ప్రతినిధి సాంబ శివుడు 9398253507ను సంప్రదించాలని కోరారు.


## 20వేల మందికి శిక్షణ అందిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్యమని ఆయన తెలిపారు.బోయపల్లి గేట్,పరిసర ప్రాంతాల యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా ఈ సెంటర్ రూపొందించనున్నామని అన్నారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నిర్మాణాన్ని అత్యంత వేగంగా పూర్తి చేసి, త్వరలో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు. కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు ఖాజా పాషా, రాషెద్‌ఖాన్,నాయకులు అజ్మత్ అలి, ఎండి ఇబ్రహీం, అతీఖ్ అహ్మద్, ఇలియాజ్ పాల్గొన్నారు.

## ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)



పోలింగ్ సామగ్రిని సరి చూసుకుంటున్న పోలింగ్ అధికారులు

1గంట వరకు పోలింగ్ జరగనుందని ఆమె తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. పంపిణీ కేంద్రంలో పోలింగ్ బాక్సులు, ఇతర సామాగ్రిని తీసుకున్న పిఓ, ఓపిఓ లు మెటీరియల్ జాగ్రత్తగా పరిశీలించి ఏదైనా కొరత ఉన్నట్లయితే తక్షణమే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి అట్టి కొరతను పరిష్కరించుకోవా లని ఆమె సూచించారు. శనివారం సాయంత్రం వరకు మీకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని ఆమె సూచించారు. ఆదివారం పోలింగ్ నిర్వహణకు ఓటింగ్ కంపార్ట్మెంట్ వంటి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆమె సూచించారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత సాధారణ పరిశీలకుల అనుమతితో గెలుపొందిన అభ్యర్థులను ప్రకటించాలని ఆమె స్పష్టం చేశారు. పోలింగ్ నిర్వహణ తదుపరి ఓట్ల లెక్కింపు లో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అత్యంత జాగ్రత్తగా అధికారులు వ్యవహరించాలని ఆమె ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి తరలింపును జోనల్, రూట్ అధికారులు పర్యవేక్షణతో పాటు ప్రతిష్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందని ఆమె తెలిపారు. మండలంలో 18 సర్పంచులకు గాను 59 మంది అభ్యర్థులు, 161 వార్డుల గాను 423 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ గాను పిఓలు 174, ఓపిఓలు 200,రిటర్నింగ్ అధికారులు 18, జోనల్ అధికారులు 6 ,రూటు అధికారులు 6గురు అధికారులను నియమించారు. వీరికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామాగ్రితో తరలి వెళ్లారు. జిల్లా కలెక్టర్ వెంట ఆర్డిఓ నవీన్ కుమార్, తహసిల్దార్ ఎల్లన్న, ఎంపీడీవో లక్ష్మి నరసింహులు, ఎంఈఓ మురళీకృష్ణ, వివిధ అధికారులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలి

**ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలి**

**గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలి**

**తమిళనాడు ఏఐసిసి పరిశీలకులు డా. చిక్కుడు వంశీకృష్ణ**



కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల తరపున ప్రచార సభలో పాల్గొన్న ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

**ఉప్పునుంతల, డిసెంబరు 13 ప్రభాతవార్త:** గ్రామాల్లో జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించే లక్ష్యంతో ప్రతి ఒక్కరు కృషి చేయాలని తమిళనాడు ఏఐసిసి పరిశీలకులు, టిపిసిసి ఉపాధ్యక్షులు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా శనివారం మండలంలోని మర్రిపల్లి, ఉప్పరపల్లి ,మామిళ్ళపల్లి, లక్ష్మాపూర్, పెద్దాపూర్, మొల్గర, సదగోడు, తిరుమలాపూర్, కొరటికల్, తిప్పాపూర్, తాడూరు, రాయిచేడు, పూర్యా నాయక్ తండా, పెనిమిళ్ళ, సిబి తండా, గువ్వలోనిపల్లి, ఈరట్వాన్ పల్లి, అయ్యవారిపల్లి గ్రామాలలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డిల ఆధ్వర్యంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడప, గడపకు చేసి కాంగ్రెస్ పార్టీ యొక్క ఆవశ్యకతను ప్రజలకు తెలియజేయాలని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేసిన ప్రతి ఒక్క అభివృద్ధి పనిని చేరవేసి గ్రామ సర్పంచ్ అభ్యర్థులను గెలిపించే బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్త, పార్టీ శ్రేణులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు ఏఐసిసి పరిశీలకులు, టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, మామిళ్ళపల్లి శ్రీ లక్ష్మీనరసింహా స్వామి ఆలయ కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి, మాజీ జడ్పీటీసీ అనంత ప్రతాప్ రెడ్డి, నాయకులు కాల్వ గోవర్ధన్ రెడ్డి, ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ డైరెక్టర్ సిరసనగండ్ల సురేందర్ రావు, కట్ట శేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సీనియర్ న్యాయవాది కర్నే లక్ష్మీనారాయణ, గ్రామాలలోని సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**మామిళ్ళపల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు...**

ఈనెల 17న జరిగు గ్రామ పంచాయితీ ఎన్నికల్లో భాగంగా శనివారం మండలంలో నిర్వహించిన ప్రచార సభలకు ముఖ్య అతిథిగా హాజరైన అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ మామిళ్ళపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ప్రతాప్ గౌడ్ మరణం మండల ప్రజలకు తీరనిలోటు



ప్రతాప్ గౌడ్ పార్థివదేహాన్నీ మోస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

**గద్వాల టౌన్, డిసెంబర్ 13, ప్రభాతవార్త:** గద్వాల మండల మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్ శుక్రవారం రాత్రి గుండెపోటుతో అకాల మరణం చెందారు. గత కొన్ని ఏళ్లుగా ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డికి ప్రాణ సన్నిహితంగా ఉంటూ,మండలఅభివృద్ధిలో తనదైన శైలిలో కృషి చేస్తూ, ప్రజల అవసరాలకు అందుబాటులో వుంటూ తన స్వంత గ్రామానికి, గద్వాల మండల ప్రజానికానికి ఎన్నో సేవలు అందించారనీ, అలాంటి వ్యక్తి మరణం గద్వాల మండల ప్రజలకు తీరనిలోటని పలు గ్రామాల ప్రజలు వ్యక్తం చేశారు. అకాల మరణం విషయం తెలుసుకు న్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి గద్వాల మండల పరిధిలోని అనం తపురం గ్రామంలో వారి స్వగృహం చేరుకుని ఆయన పార్థివ దేహాని కి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ... నాకు వ్యక్తిగతంగా మంచి మిత్రుడు అప్పుడు గద్వాల మండలంలో అనంతపురం గ్రామం లో సర్పంచిగా గద్వాల మండలం ఎంపీపీగా ప్రజలకు ఎన్నో సేవలను అందించి, ఎంతో అభివృద్ధి చేయడం జరిగిందనీ, ఇలాంటి మంచి నాయకుడు ఈరోజు లేకపోవడం చాలా బాధాకరమైన విషయం అని, ఇది గద్వాల మండల ప్రజలకు, పార్టీకి తీరనిలోటని ఆయన అన్నారు. ఈ విషయాన్ని విన్న వెంటనే నేను జీర్ణించుకోలేకపోయానని, ప్రతాప్ గౌడ్ లేని మాటలు వింటే చాలా బాధాకరంగా ఉన్నదనీ, భౌతికంగా ఆయన మన మధ్యలో లేకపోయినా ఆయన జ్ఞాపకాలు మాతోపాటు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### మాజీ ఎంపిపి కుటుంబ సభ్యులను పరామర్శించిన సరితమ్మ

**గద్వాలటౌన్ డిసెంబర్13,ప్రభాతవార్త:** జెడ్పి మాజీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరితమ్మ అకాల మరణం చెందిన మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులకు పరామర్శించారు. ప్రతాప్‌గౌడ్ మరణం గద్వాల మండల ప్రజలకు తీరనిలోటని ఆమె అన్నారు. వీరి వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

### మాజీ ఎంపీపీకి నివాళులర్పించిన బాసు హనుమంతు

**గద్వాల టౌన్ డిసెంబర్ 13, ప్రభాతవార్త:** గద్వాల నియోజకవర్గ బిఆర్‌యస్ పార్టీ ఇంచార్జీ బాసు హనుమంతు నాయుడు గద్వాల మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్ పార్థివదేహానికి పూల మాల వేసి నివాళ్ళు అర్పించారు. మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్ గుండెపోటుతో ఆకాల చెందాడు, విషయం తెలుసుకొని బాసు హనుమంతు వారి స్వగృహానికి వెళ్లి,ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించి,కుటుంబ సభ్యులను పరామర్శించి,తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరి వెంట,చక్రధర్ రావు, మోనేష్,గంజిపేట రాజు,తిరుమలేష్,రాంమోహన్ యాదవ్,ముని మోర్య,మధు,నరసింహులు, వీరేష్,రాజేష్,గోవిందు కృష్ణ, రవి తదితరులు ఉన్నారు.


### ఎమ్మెల్యేను కలిసిన కుర్మిద్ద గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి



ఎమ్మెల్యేతో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు

**కల్వకుర్తి,డిసెంబర్13 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం కుర్మిద్ద గ్రామ సర్పంచ్‌గా నూతనంగా ఎన్నికైన పులగుర్ల కృష్ణరెడ్డి, వార్డు సభ్యులు శనివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అదే విధంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నూతనంగా ఎన్నికైన సర్పంచ్ పులగుర్ల కృష్ణరెడ్డితో పాటు వార్డు సభ్యులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతనంగా గెలిచిన ఉప సర్పంచ్ నాగరాజు, వార్డు సభ్యులు బాలరాజు గౌడ్, శివ, నాయకులు గోవర్ధన్ రెడ్డి, సైదులు గౌడ్, వెంకటస్వామి, కూమార్,తదితరులు పాల్గొన్నారు.

### జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, డిసెంబర్ 13 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని కొట్ర గ్రామానికి చెందిన 10టీవీ రిపోర్టర్ బూత్కూరి మల్లేష్ అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కరరావు సంతాపం తెలిపి రూ.25వేల ఆర్థిక సహాయాన్ని సమకూర్చడంతో ఆయన తరుపున మాజీ సర్పంచ్ సూగూరు సాయికుమార్ మృతుడు భార్య స్వాతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు మల్లేష్, కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యేలకు దిక్కు లేకపోతే.. సర్పంచులకు ఇంకెక్కడ?

**బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డి**



**నారాయణ పేట, డిసెంబరు 13 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా లోగత రెండేళ్లుగా కొనసాగుతున్న రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఎమ్మెల్యేలకే నియోజకవర్గ అభివృద్ధి నిధులు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు,మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డి విమర్శించారు. అలాంటప్పుడు గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచులకు నిధులు ఎలా ఇస్తారో ప్రజలు ఆలోచించాలని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని తాను కాదు, స్వయంగా కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన మహబూబ్‌నగర్,జడ్చర్ల ఎమ్మెల్యేలు బహిరంగంగా చెబుతున్నారని అన్నారు. ఎమ్మెల్యేలకే నిధులు లేని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. దేశవ్యాప్తంగా ప్రకటించిన 20 ఉత్తమ అవార్డుల్లో 19 అవార్డులు కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణకు వచ్చాయని గుర్తు చేశారు. కానీ రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ట్రాక్టర్లకు డీజిల్ పోసే పరిస్థితి కూడా లేదని ఎద్దేవా చేశారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మళ్లీ గ్రామాలకు మంచి రోజులు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో గ్రామ పంచాయతీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ చేతిలో ప్రజలు మరోసారి మోసపోవద్దని అన్నారు. గార్లపాడు, కాన్‌కుర్తి, కోటకొండలను మండలాలుగా చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లయినా అమలు చేయలేదని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పే బాధ్యత ప్రజల చేతుల్లో ఉందని అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుదారులను గెలిపించి కాంగ్రెస్ మద్దతుదారులను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఇదే ఉత్సాహంతో గ్రామాల అభివృద్ధికి పాటు పడాలి



నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

**కల్వకుర్తి, డిసెంబర్ 13 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మండలంలోని నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచులు ఎమ్మెల్యేను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నూతనంగా ఎన్నికైన సర్పంచులు ఆంజనేయులు, రాజేశ్వరి, లలిత, నాగార్జున గౌడ్, ఆయా గ్రామాల నూతన మహిళ సర్పంచ్‌లు, వారి భర్తలు, వార్డు సభ్యులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ మంచి మెజార్టీతో విజయం సాధించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఇదే ఉత్సాహంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించి ప్రజల ఆదరాభిమానాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అశోక్ రెడ్డి, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్ కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, జిల్లా నాయకులు మిర్యాల శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి, నాయకులు జమ్ముల శ్రీకాంత్, సంతు యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 181 లీటర్ల అక్రమ మద్యం పట్టివేత : ఎస్ఐ వెంకటేశ్వర్లు



అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని పట్టుకున్న పోలీసులు

**నారాయణపేట,డిసెంబరు 13 ప్రభాతవార్త:** నారాయణపేటమండలం పేరపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన వ్యక్తిపై నారాయణపేట టౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఎన్నికల నిబంధనల అమలులో భాగంగా అశోక్ గౌడ్ కిరాణా దుకాణంలో అక్రమ మద్యం నిల్వ ఉన్నట్లు పక్కా సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో మొత్తం 181 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన మద్యాన్ని నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు విచారణలో స్వాధీనం చేసుకున్న మద్యం విలువ సుమారు రూ. 65,600/గా నిర్ధారించబడిందని టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అక్రమంగా మద్యం నిల్వ ఉంచినందుకు సంబంధిత వ్యక్తి అశోక్ గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో అక్రమ మద్యం విక్రయం, నిల్వ, పంపిణీపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే విధంగా అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ స్పష్టం చేశారు. అక్రమ మద్యం, డబ్బు పంపిణీకి సంబంధించిన సమాచారం ఉన్నట్లయితే ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. శాంతియుతంగా, స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**జోరుగా సాగుతున్న పల్లె పోరు**

## స్థానిక పోరులో ఓటర్ అన్న చూపెటో...!



మర్రి పల్లి గ్రామంలో నిర్వహించిన రోడ్ షో లో పాల్గొన్న డిసిసిబి డైరెక్టర్, సర్పంచ్ అభ్యర్థి సత్తు భూపాల్ రావు

**ఉప్పునుంతల, డిసెంబరు 13 ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధమవుతున్నాయి. ఏర్పాట్లు పూర్తి చేసేందుకు అధికారులు పూర్తిగా నిమగ్నమయ్యారు. మండలంలో 27 గ్రామ పంచాయతీలకు గాను ఒక గ్రామపంచాయతీ సూర్య తండా ఏకగ్రీవంగా కాగా మిగిలిన 26 గ్రామ పంచాయితీలకు ఈనెల 17న జరుగు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు గ్రామాలలో జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామాలలో మొదలైన ఎన్నికల వాతావరణం వేళ ప్రజానాడి చూస్తే వయోదికుల కన్నా యువత కే సర్పంచులు, ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకునేందుకు ఓటర్ అన్న మొగ్గు చూపుతున్నారని, యువతి ,యువకులు రాజకీయ చైతన్యం కలిగినప్పుడే ఈ సమాజం మరింత ముందుకు వెళుతుందని, నిస్వార్థంగా ప్రజాసేవ చేయాలనే దృక్పథం కలిగి ఉండేటటువంటి వారికి సంపూర్ణంగా ప్రజలు మొగ్గు చూపుతున్నారని గ్రామాలలో కొంతమంది వివరిస్తున్నారు. ప్రజలు కొత్తవారిని ఎన్నుకోవడం, గ్రామంలో మంచి చేసిన వారిని వదులుకోకపోవడం చాలావరకు ఓటర్లు గమనిస్తున్నారని చెప్పవచ్చు. ఏది ఏమైనప్పటికి గ్రామాభివృద్ధి లక్ష్యంతో పనిచేస్తున్న వారికే పట్టం కట్టాలని ప్రజలు మొగ్గుచూపుతున్నారని, భవిష్యత్ కార్యాచరణతో సర్పంచ్ అభ్యర్థులు ప్రజల ముందుకు వెళ్తున్నారు. మండల కేంద్రమైన ఉప్పునుంతలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి చింత గాళ్ళ శ్రీనివాసులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి ఒక్కసారి అవకాశం కల్పిస్తే గ్రామాభివృద్ధికి ఎన్నో విధాలుగా విచ్చేస్తానని ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. డిసిసీబి డైరెక్టర్ గా, సింగిల్ విండో చైర్మన్ గా పనిచేసి ఎంతోమంది రైతులకు రుణాలు అందజేయడం, దీర్ఘకాలిక రుణాలు అందజేసి ఎంతోమందికి తోడ్పాటు అందించిన డిసిసిబి డైరెక్టర్ సత్తు భూపాల్ రావు తన స్వగ్రామంలో ప్రజలకు మెరుగైన సేవలందించాలని, గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించి శాశ్వతమైన వనరులను ఏర్పాటు చేసుకోవడమే తమ లక్ష్యమని పేర్కొంటూ గ్రామంలో ప్రజల వద్దకు వెళ్లి భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాల పట్ల అవగాహన కల్పిస్తూ సర్పంచ్ అభ్యర్థిగా గెలిపించాలంటూ అభ్యర్థిస్తున్నారు. మండలంలో అతిపెద్ద గ్రామమైన ఉప్పునుంతలతో పాటు వెల్టూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ సర్పంచ్ గుండె మోని లింగమయ్య యాదవ్ , మాజీ సాగు నీటి సంఘం చైర్మన్ బూసిరాజ్ మల్లయ్య లు సర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. యువకుడు, మాజీ ఆర్మీ ఉద్యోగి చింతోజు వెంకటేశ్వర్లు బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా రంగంలో ఉన్నారు. మండలంలో సర్పంచ్ అభ్యర్థులుగా రంగంలో ఉన్నవారు ఇంటింటి ప్రచారంలో నిమగ్నమై ఉన్నారు. మండలంలోని మర్రిపల్లి గ్రామంలో డిసిసిబి డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్ రావు శనివారం గ్రామంలో భారీ జన సమూహం మధ్య రోడ్ షో నిర్వహించారు. గ్రామాభివృద్ధి కోసం చేపట్టబోయే అభివృద్ధి పనుల పట్ల ప్రజలకు హామీ ఇచ్చారు.

## దొరేపల్లి సర్పంచ్‌గా కె.నవిత



సర్పంచ్‌గా గెలుపొందిన నవితను సన్మానిస్తున్న దృశ్యం

**మద్దూరు, డిసెంబరు13 ప్రభాతవార్త :** మద్దూరు మండలం దొరేపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలోకి దిగిన కె. నవీత అశోక్ గౌడ్ సర్పంచ్‌గా, కె. నరేష్ గౌడ్ ఉప సర్పంచ్‌గా భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్‌లను కొడంగల్ తాలూకాగౌడ సంఘం అధ్యక్షులు మాలేల విరేష్‌గౌడ్, మద్దూరు మండల గౌడ సంఘం అధ్యక్షుడు రాజుగౌడ్, టౌన్ అధ్యక్షుడు కుడుగుంట నర్సింహులు గౌడ్ తదితరులు శాలువాలతో సన్మానించారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు సూచించారు. ప్రజల నమ్మకానికి తగ్గట్టుగాపని చేస్తామని సర్పంచ్ కె.నవిత, ఉపసర్పంచ్ కె. నరేష్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక గౌడ సంఘం నాయకులు సాయిలుగౌడ్, హనుమంతు గౌడ్, నరేష్ గౌడ్, అశోక్ గౌడ్, అనిల్, ఎండి. మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీలో చేరికలు



మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరిన దృశ్యం

**మక్తల్ టౌన్, డిసెంబరు 13 ప్రభాతవార్త:** మక్తల్ మండలం చిన్న గోప్లాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి బిఆర్ఎస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారు తిరుపతిరెడ్డి,పెద్ద కురుమూర్తిగౌడ్, కావలి ఆంజనేయులు, కురుమ చిన్న హనుమంతు, పోతుల ఆంజనేయులు,నడిపికురు వన్నగౌడ్,బోయగోపాల్, బోయ ఆనంద్, రాంపురం నరసింహ, గోప్లాపూర్ సర్పంచ్ అభ్యర్థి వీరారెడ్డి కత్తెర గుర్తుకు ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామోహన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నరసింహ గౌడ్,పట్టణ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జుట్ల హనుమంతు, గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ కృష్ణయ్య శెట్టి, విష్ణువర్ధన్ రెడ్డి, శివ శంకర్, లక్ష్మణ్ నారాయణ, గౌడ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి

**నారాయణపేట, డిసెంబరు13 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లా ఉట్కూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మద్దతు అభ్యర్థి దంతన్‌పల్లి సుజాత యగ్నేశ్వర్‌రెడ్డిని సర్పంచ్‌గా గెలిపించాలని మాజీ జెడ్పిటిసిలు సూర్య ప్రకాశ్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు బాల్‌రెడ్డి, మణెమ్మ, మాజీ సింగిల్ విండో అధ్య క్షులు ఎల్కోటి నారాయణరెడ్డి గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు.మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో గ్రామంలో సమగ్ర అభివృద్ధి జరుగుతుందని వారు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో అభ్యర్థితో కలిసి కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం ముమ్మరంగా చేపట్టారు. గడపగడపకు వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సర్పంచ్‌తో పాటువార్డు సభ్యులను గెలిపిస్తే గ్రామంఅన్నిరంగాల్లోఅభివృద్ధి చెందుతుందని తెలిపారు. గ్రామం లో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్క రించేందుకు ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలని కోరారు. మంత్రి వాకిటి శ్రీహరి సహకారంతో గ్రామ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు.



## గ్రామ అభివృద్ధే ధ్యేయం ముందుకు..



మాట్లాడుతున్న డా. శ్రీనివాసరెడ్డి

**మక్తల్ టౌన్ డిసెంబరు 13 ప్రభాతవార్త :** మక్తల్ మండలంలోని మాద్వార్ గ్రామానికి చెందిన డా. శ్రీనివాసరెడ్డి ప్రజలతో దశాబ్దాల అనుబంధాన్ని ఏర్పరచుకున్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం మాద్వార్ గ్రామం బిజెపి అసెంబ్లీ కన్వీనర్ మక్తల్ కర్నే సామి నేడు శ్రీనివాస్ రెడ్డికి మద్దతుగా మాద్వార్ గ్రామంలో ప్రచారంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ శ్రీనివాస్ రెడ్డి అనేవ్యక్తి డాక్టర్ వృత్తి నిర్వహిస్తూ గ్రామ ప్రజలకు ఎంతో సేవ చేశాడు. ఆ సేవకు అధికారాన్ని ఇవ్వండి మీ గ్రామ సమస్య ఏదైనా సరే పరిష్కరించి గ్రామ అభివృద్ధి ని ముందుకు తీసుకెళ్లే విద్యావంతుడు ఆయనని గ్రామ సర్పంచ్ గా ఎన్నుకోవాలని కోరారు. డా. శ్రీనివాసరెడ్డి రాజకీయ రంగ ప్రవేశం 2019లో మాద్వార్ సోమేశ్వర బండ బిజెపి ఎంపీటీసీ అభ్యర్థిగా స్వల్ప మెజారిటీతో ఓటమి చెంది ఎక్కడ కూడా ఓటమి కృంగిపోకుండా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ తనకంటూ ప్రత్యేక రాజకీయ గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి డా. శ్రీనివాసరెడ్డి నేడు మళ్ళీ అదే ప్రజా ఆధారణతో స్థానికే ఎన్నికల్లో సర్పంచ్ బరిలో మాద్వార్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పదిమంది వార్డు సభ్యులత కలిసి బరిలో ఉన్నారు.మాద్వార్ గ్రామ ప్రజలు ప్రచారంలో మహిళలు భారీ ఎత్తున పాల్గొని బ్రహ్మరథం పడుతున్నారు. గెలుపేలక్ష్యంగా గ్రామ అభివృద్ధి ధ్యేయంగా యువతలో ప్రజాదరణ పొందుతూ ముందుకు సాగుతున్నారు.మాజీ ఎంపిటిసి సంతోష్ రెడ్డి, డా. ఆశప్ప, రామకృష్ణ,వడ్ల శ్రీనివాస్,లక్ష్మారెడ్డి,బాటనరసింహ, పూజారి బాలప్ప, జోగు వెంకటేష్ , పుల్లకూరి నాగప్ప, స్థానిక మహిళలు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి మహా పడిపూజ






మహా పడిపూజలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే దంపతులు

**దేవరకద్ర,డిసెంబరు13 ప్రభాత వార్త:** దేవరకద్ర మండల కేంద్రం లో శ్రీశ్రీశ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ హరిహర పుత్ర అయ్యప్ప శరణం ధర్మ స్థాపనకు,ధర్మ పరిరక్షణకు,మార్గమని స్వామివారిదయతో దేవరకద్ర నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

## ప్రజల నమ్మకాన్ని ఒమ్ము చేయను..

### - ఉల్లంపల్లి సర్పంచ్ నర్మద సలేశ్వరం

**వంగూరు, డిసెంబర్ 13 ప్రభాతవార్త:** మొదటి విడతలో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో వంగూరు మండలం ఉల్లంపల్లి గ్రామానికి చెందిన నర్మదా సలేశ్వరం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసి విజయాన్ని పొందారు. సర్పంచ్‌గా విజయాన్ని అందించిన గ్రామస్తుల కృషిని మాపై నమ్మకం పెట్టుకొని సర్పంచ్ పదవిని కట్టబెట్టిన ఉల్లంపల్లి గ్రామ ప్రజల నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా కట్టుబడి ఉండి గ్రామాన్ని అభివృద్ధిపరిచేందుకు కృషి చేస్తానని సర్పంచ్ నర్మదా సలేశ్వరం పేర్కొన్నారు. గ్రామాన్ని అభివృద్ధి పరిచేందుకు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సహాయ సహకారాలు తీసుకొని అన్ని విధాలుగా గ్రామాన్ని అభివృద్ధి పరిచి గ్రామ ప్రజల మన్ననలను పొందెందుకు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. సర్పంచ్ విజయాన్ని అందించేందుకు కృషి చేసిన నాయకులకు కార్యకర్తలకు గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.



ఉల్లంపల్లి సర్పంచ్ నర్మద సలేశ్వరం

# పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

**బిజినేపల్లి, డిసెంబరు13 ప్రభాతవార్త:** రెండోవిడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు అధికారులు తయారయ్యారు. బిజినేపల్లి మండలంలో పకడ్బందీగా ఎన్నికలను నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. మండలంలో ఆదివారం జరగబోయే ఎన్నికల నిర్వహణకు అధికారులు గ్రామాలకు తరలి వెళ్లారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గం.ల వరకు జరిగే పోలింగ్ లో 61736 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 30695 మంది పురుషులు, 31040 మంది స్త్రీలు, ఇతరులు ఒకరు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమయ్యే స్టేజ్1, స్టేజ్ 2 ఆర్వోలు, పీవోలు, ఓపివో లను ఎన్నికల నిర్వహణ కోసం నియమించినట్లు తెలిపారు.మరి కొంతమందిని అధికారులను రిజర్వులో ఉంచారు. నేడుజరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి అధికారులు ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలను వెల్లడించనున్నారు.రెండో విడత పంచాయతీ ఎన్నికలు జరిగే పోలింగ్ స్టేషన్‌లలో వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు.మొత్తం35సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, రామ్‌రెడ్డి పల్లె సర్పంచ్ స్థానం ఏకగ్రీవం అయింది. మిగిలిన 34 స్థానాలలో 135 మంది అభ్యర్థులు, 292 వార్డు స్థానాలకు 846 మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. మండలంలో 34 గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించే గ్రామాలకు సంబంధిత సిబ్బందికి విధులను కేటాయించి ఎన్నికల సామాగ్రిని అప్పగించినట్లు తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో పంచాయతీ ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. రెండో విడత పంచాయతీ ఎన్నికల సందర్భంగా మండలంలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసినట్టు ఎస్ఐ కె.శ్రీనివాస్ తెలిపారు. పంచాయతీ ఎన్నికల రూట్లలో తగిన సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించామని అదరపు బలగాలతో పహారా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలోస్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎవరైనా ప్రలోభాలకు గురిచేసినా, భయభ్రాంతులకు పాల్పడినా డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కె శ్రీనివాస్ హెచ్చరించారు.



బిజినపల్లిలో ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్న అధికారులు

## పంచాయతీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

■ డిఎస్పీ వెంకటేశ్వర్లు

**చిన్న చింతకుంట, డిసెంబరు 13 ప్రభాతవార్త :** రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం పతిష్ట భద్రత నిర్వహిస్తున్నట్లు డిఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి పోలింగ్ స్టేషన్ల వద్ద నిర్వహించే భద్రతపై అవగాహన కల్పించారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల బందోబస్తుగాను డిఎస్పి1, సిఐలు 4 ,ఎస్సైలు10, ఏఎస్ఐ ,హెడ్ కానిస్టేబుల్, పోలీసులు కలిపి 100 మందితో భద్రతను పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. పోలీస్ స్టేషన్ నుంచి 100మీటర్ల దూరంలో 144 సెక్షన్ అందుబాటులో ఉంటుందని ఎవరు కూడా ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చట్టరీత్య చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఓట్ల లెక్కింపు తర్వాత గెలిచినవారు ర్యాలీలు నిర్వహించరాదని ఆయన సూచించారు. అనంతరం ఆయా పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు.



భద్రతపై సూచనలు ఇస్తున్న డిఎస్పి వెంకటేశ్వర్లు

## దేశానికి సేవ చేయాలన్న లక్ష్యం ఎంతో గొప్పది

**నారాయణ పేట, డిసెంబరు13 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ లయన్స్ క్లబ్ భవనంలో వారియర్స్ డిఫెన్స్ అకాడమీ, లయన్స్ క్లబ్ ఆఫ్ పేట సంయుక్తంగా అగ్నివీర్,ఎస్ఎస్‌జీడీ ఉద్యోగాలు సాధించిన యువకులను ఘనంగా సన్మానించారు. జీవితంలో స్థిరపడేందుకు పేదరికం అడ్డు కాకూడదని, రాణించాలనే తపన ఉంటే యువత తప్పకుండా లక్ష్యాన్ని సాధిస్తారని లయన్స్ క్లబ్ ఆఫ్ పేట అధ్యక్షురాలు సరిత హరి నారాయణ భట్టడ్ అన్నారు.రక్షణ రంగంలో యువత రాణించడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. ఈ అకాడమీ, లయన్స్ క్లబ్ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశానికి సేవ చేయాలన్న లక్ష్యం ఎంతో గొప్పదని, దేశం బాగుంటేనే ప్రజలు బాగుంటారని అభిప్రాయపడ్డారు. లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు యువత భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలకంగా మారుతున్నాయని తెలిపారు. వారియర్స్ డిఫెన్స్ అకాడమీ సహకారంతో మొత్తం 14 మంది యువకులు రక్షణ రంగంలో ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు.వీరిలో 11 మంది అగ్నివీర్‌గా, ముగ్గురు ఎస్ఎస్‌జీడీ విభాగంలో ఎంపికయ్యారని తెలిపారు ఉద్యోగాలు సాధించిన యువకుల్లో కృష్ణ (గూడెబల్లూరు), నవీన్ (అంతవార్), సిద్ధు (ధన్వాడ), శ్రీను (మద్దూర్), పవన్ (కోయిల కొండ),మహేష్ (రామకిష్టయపల్లి),నందు, శ్రీనివాస్ (గూడెబల్లూరు), మహేష్,నరేష్ (మక్తల్), విష్ణు, రిషికేష్, మల్లేష్ (నిడిజింత), అవినాష్ రెడ్డి (పెద్దిరిపాడు) ఉన్నారు. కార్యక్రమంలో సాయినాథ్, రాధా సదానందం, భీమ్ చందర్ గౌడ్, కృష్ణమూర్తి, సత్యనారాయణ దూత్,రవికుమార్‌గౌడ్, శేషమ్మ, పూరి వెంకటేష్, పోలేపల్లి రాజేష్,వారియర్స్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ ఆంజనేయులు, బాలు తదితరులు పాల్గొన్నారు.



అగ్నివీర్, ఎస్ఎస్‌జీడీ ఉద్యోగాలు సాధించిన యువకులను సన్మానిస్తున్న దృశ్యం

## ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీకి విద్యార్థుల స్వాగతం

**ఇటిక్యాల డిసెంబర్ 13, ప్రభాతవార్త;** అర్జెంటీనా దేశానికి చెందిన ప్రపంచ ఫుట్ బాల్ దిగ్గజం లియోనల్ మెస్సి తెలంగాణ రాష్ట్రానికి వస్తుండగా మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో గల సరస్వతి టెక్నో ఇంటర్నేషనల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు వెల్ కమ్ మెస్సి తెలంగాణ అంటూ అక్షరాల ఆకారంలో విద్యార్థులు స్వాగతం పలికారు.. ఫుట్‌బాల్ ఐకాన్ మరియు ప్రపంచ కప్ విజేత లియోనెల్ మెస్సీకి ఎర్రవల్లి సరస్వతి టెక్నో పాఠశాలకు చెందిన విద్యార్థులు శనివారం హృదయపూర్వకంగా స్వాగతం పలికారు, ప్రపంచ క్రీడా దిగ్గజం పట్ల తమ ఉత్సాహాన్ని, అభిమానాన్ని వ్యక్తం చేస్తూ ఒక చిన్న స్వాగతోరణం రూపొందించారు. ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ శనివారం సాయంత్రం తెలంగాణలోని హైదరాబాద్‌కు చేరుకుని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ఒక స్నేహపూర్వక ఫుట్‌బాల్ ఆటలో పాల్గొంటున్నారు. ఆయన రాక సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు, ఫుట్‌బాల్ అభిమానులు, క్రీడా అభిమా నులు ఉత్సాహంలో ఉండగా స్ఫూర్తిదాయకమైన విద్యార్థుల సృజనాత్మకత, క్రీడల పట్ల వారికున్న మక్కువ, ఫుట్‌బాల్ ద్వారా అంతర్జాతీయ స్నేహ స్ఫూర్తిని చాటనున్నారు. ఫుట్ బాల్ దిగ్గజం తెలంగాణకు వస్తుండగా విద్యార్థులు స్వాగ్నత అంటూ చేసిన కార్యక్రమాన్ని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కరస్పాండెంట్ మధులికరెడ్డి, ప్రిన్సిపల్ సుధీర్‌కుమార్ ఉపాధ్యాయులు, పిఈటిలు, విద్యార్థులు పాల్గొన్నారు.




ప్రపంచ దిగ్గజ క్రీడాకారుడు లియోనల్ మెస్సికి అక్షరాల రూపంలో స్వాగతం పలికిన విద్యార్థులు

## రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**మల్దకల్ డిసెంబర్ 13,ప్రభాతవార్త;** మల్దకల్ మండలంలోని రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. డిస్ట్రిబ్యూషన్ కౌంటర్ ఏర్పాటు చేసి రూట్ల వారీగా పోలింగ్ సిబ్బందిని, బస్సులలో బ్యాలెట్ బాక్సును ఎన్నికల సామాగ్రిని తరలించారు.మండలంలోని 21 గ్రామాలకు సర్పంచ్ ఎన్నికలతో పాటు వార్డు సభ్యులకు ఎన్నికలు జరుగుతాయి.ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుంది.రెండు గంటల నుండి ఎన్నికల కౌంటింగ్ ప్రారంభమై ఫలితాలను విడుదల చేస్తారు.వార్డు సభ్యులు లెక్కింపు తర్వాత సర్పంచ్ ఓట్లను లెక్కించి సర్పంచ్ తో పాటు ఉపసర్పంచ్ ఎన్నిక కూడా జరుగుతుంది. మొత్తం ఓటర్లు 37,915 ఉన్నారు.వీరిలో 18,565 పురుషులు,19,350 స్త్రీలు ఓటర్లు ఉన్నారు.8 మంది జోనల్ ఆఫీసర్లు, 21 గ్రామపంచాయతీలు ఎన్నికలు జరగనున్నాయి.205 పోలింగ్ స్టేషన్లో,187 వార్డ్ మెంబర్ ఎన్నికలు జరుగుతాయి. నీలిపల్లి గ్రామంలో వార్డ్ మెంబర్లకు ఎన్నికలు జరగనున్నాయి.సర్పంచ్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో వార్డు సభ్యులకు మాత్రమే ఎన్నికలు జరుగుతాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.జిల్లా ఎస్పీ తోట శ్రీనివాసరావు డిస్ట్రిబ్యూషన్ కౌంటర్ వద్ద ఎస్సైలకు పోలీస్ సిబ్బందికి సలహాలు సూచనలు అందించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా అందరూ సహకరించినందుకు కృషి చేయాలని ఆయన సూచించారు.



సామాగ్రితో బయలుదేరిన పోలీస్ సిబ్బంది



నవోదయ ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

## ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

**బిజినేపల్లి, డిసెంబరు13 ప్రభాతవార్త:** వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరవ తరగతిలో ప్రవేశానికి శనివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రవేశ ఎంపిక పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 29 పరీక్షా కేంద్రాలలో పరీక్షను నిర్వహించగా 78 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 7115 మంది దరఖాస్తు చేసుకోగా 5607 మంది హాజరయ్యారు. అన్ని కేంద్రాలలో కలిపి 1508 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇందులో బాలుర హాజరు3005, బాలికల హాజరు 2602 మంది హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ జిల్లాల విద్యాశాఖాధికారులు, కలెక్టర్లు నియమించిన తనిఖీ అధికారులు, నవోదయ అధికారులు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. వివిధ జిల్లాల పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాటు చేయగా, వివిధ జిల్లాల వైద్య ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు , పొరపాట్లకు తావివ్వకుండా పరీక్షను నిర్వహించారు.

## రెండో విడత ఎన్నికలకు భారీ బందోబస్తు

- ◆ విజయోత్సవ ర్యాలీలలు ఊరేగింపులకు అనుమతి లేదు
- ◆ శాంతియుత ఎన్నికల నిర్వహణకు ప్రజలందరూ సహకరించాలి
- ◆ వనపర్తి జిల్లా ఎస్పీ సునితరెడ్డి

**వనపర్తి, డిసెంబరు13 ప్రభాతవార్త:** జిల్లాలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు పటిష్ట మైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడత స్థానిక సంస్థల ఎన్నికలు ఎలాంటి ఘటనలకు తావు లేకుండా నిస్పక్షపాతం గా జరగడంలో పోలీసు అధికారులు, సిబ్బంది కీలక పాత్ర పోషిం చారని ప్రశంసిస్తూ అదేవిధంగా రెండో విడత ఎన్నికల్లో కూడావిధులు నిర్వహించి విజయవంతంగా పూర్తి చేయాలని ఆమె కోరారు.రెండవవిడత స్థానిక సర్పంచ్‌ఎన్నికలు ఆదివారం వనపర్తి జిల్లాలో వనపర్తి, కొత్తకోట, ఆత్మకూరు, మదనపూర్,అమరచింత మండలాలలో మొత్తం 94 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయని, 1150 మంది పోలీసు అధికారులు సిబ్బందిచే ఎన్నికలను ప్రశాంత వాతారణంలో నిర్వహించేందుకు అన్ని రకాల పటిష్టమైన భద్రత ఏర్పాట్లను చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.



జిల్లా ఎస్పీ డి. సునీతరెడ్డి (ఫైల్)

## గ్రామాలు అభివృద్ధి జరగాలంటే బిజెపితోనే సాధ్యం

◆ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

**లింగాల, డిసెంబరు 13 ప్రభాతవార్త:** లింగాల మండల కేంద్రంలో బిజెపి బలపర్చిన సర్పంచ్ అభ్యర్థిని మూడవత్ సరిత శంకర్ నాయక్‌ని గెలిపించాలని మాజీఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శనివారం లింగాల మండల కేంద్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్ని మాట్లాడారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి జరగాలంటే బిజెపితోనే సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని తెలిపారు.ఎమ్మెల్యేగా రెండు పర్యాయాలు పనిచేసినప్పుడే లింగాల మండలంలోని గ్రామాలు అభివృద్ధి చెందాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు భరోసా, మహిళలకు రూ.2500, పెన్షన్ రూ.4వేలు ఇస్తామని మోసం తీసిందని అన్నారు. గ్రామం అభివృద్ధి జరగాలంటే బిజెపి బలపర్చిన సర్పంచ్ అభ్యర్థిని మూడవత్ సరిత శంకర్ నాయక్‌ని ఫుట్ బాల్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు గువ్వని నవీన్, జిల్లా అధ్యక్షులు నరేందర్ రావు, నాగేశ్వర్ ,మహేశ్వరం పాల్గొన్నారు.

## సర్పంచుల గెలుపుకు వారి ఓటర్లే కీలకం

**మల్దకల్ డిసెంబర్13,ప్రభాతవార్త;** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం గ్రామపంచాయతీ ఎన్నికలలో ఎస్సీ ఓటర్లే కీలకంగా మారింది.నాగర్‌దొడ్డి,కుర్తి రావులచెరువు,అమరవాయి మల్దకల్ ,తాటికుంట గ్రామాలలో ఉన్న ఎస్సీ ఓటర్లు కీలకంగా మారడంతో సర్పంచ్ స్థానాలు గెలుపు వీరిపైనే ఆధారపడి ఉంది. వీరు ఓట్లు ఎక్కడ వేస్తే అక్కడ సర్పంచ్ గెలుపొంది అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అంటున్నారు.అమరవాయి జనరల్ స్థానంలో ఇద్దరు ఓసి,ఒకరు బీసీ అభ్యర్థులు నిలబడ్డారు. కుర్తిరావుల చెరువు జనరల్ స్థానంలో ఇద్దరు బీసీ అభ్యర్థులు కాగా,నాగర్ దొడ్డి జనరల్ స్థానంలో ఇద్దరు బీసీ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మల్దకల్ బీసీ మహిళ స్థానంలో ఇక్కడ నలుగురు పోటీలో ఉన్నప్పటికీ ఇద్దరు మధ్య ప్రధానంగా పోటీ నెలకొంది.ఇక్కడ ఎస్సీల ఓట్లే కీలకంగా మారింది.తాటికుంట బీసీ మహిళ రిజర్వ్ కావడంతో ఇక్కడ కూడా ప్రధానంగా ఎస్సీల ఓట్లే కీలకంగా ఉండడంతో వారు ఎక్కడ ఓట్లు వేస్తే సర్పంచ్ గెలుపు అవకాశాలు ఉన్నాయి.

## గ్రామ అభివృద్ధి ప్రత్యేక లక్ష్యం

◆ వెలుమలపల్లి గ్రామ సర్పంచ్‌గా రామస్వామి

**వంగూరు, డిసెంబర్ 13 ప్రభాతవార్త:** ఊహ తెలిసినప్పటినుండి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేసిన రామస్వామికి జరిగిన స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరఫున అభ్యర్థిగా నియమించ కపోవడం వల్ల కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా వెలుమల్లపల్లి గ్రామ సర్పంచ్‌గా నామినేషన్ వేసి గెలుపొందారు. గత అసెంబ్లీ ఎన్నికలలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ గెలుపు కోసం తన వంతు కృషిచేసి గెలుపులో భాగస్వాములైనప్పటికీ సర్పంచ్ అభ్యర్థిగా ఎంపిక చేయకపోవడంతో గ్రామస్తుల సహకారంతో ఎన్నికల బరిలో రెబల్‌గానిలిచారు. గ్రామస్తుల అండదండలతో కాంగ్రెస్ అభ్యర్థి మల్లేష్‌పై కాంగ్రెస్‌రెబల్‌గా ఎన్నికల బరిలో నిలిచిన రామస్వామి విజయం సాధించారు. గ్రామస్తుల నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా గ్రామనిఅన్నివిధాలుగా అభివృద్ధిపరిచేందుకు కాంగ్రెస్ పార్టీని వీడకుండా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సహకా రంతో గ్రామాన్ని అభివృద్ధి పరుస్తానని ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటానని సర్పంచ్‌రామస్వామి పేర్కొన్నారు.తనపై నమ్మకం పెట్టి సర్పంచ్‌పదవి కట్టబెట్టిన గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, వారికి ఏకష్టం వచ్చినా తానుఅండగా ఉండి కష్ట సుఖాలలోపాలుపంచుకొని మీలోఒకడినై ఉంటానాన్ని పేర్కొన్నారు.



రామస్వామి, వెలుమలపల్లి గ్రామ సర్పంచ్

## శ్రీస్వయంభు శ్రీకృష్ణ స్వామిని దర్శించుకున్న రమ్య ఇండస్ట్రీ అధినేత

**మల్దకల్ డిసెంబర్ 13, ప్రభాతవార్త;** రమ్య ఇండస్ట్రీ అధినేత రాజశేఖర్ రెడ్డి దంపతులుజోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం, సద్దలోనిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ స్వయంభు శ్రీకృష్ణ స్వామిని శనివారం రోజున దర్శించుకున్నారు రమ్య ఇండస్ట్రీ అధినేత బండ్ల రాజశేఖర్‌రెడ్డి దంపతులు. అలాగే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి పట్టు వస్త్రంతో పాండు స్వామిఅర్చకులు సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ పూజాకార్యక్రమంలో నూతన సర్పంచ్ బెల్లం నర్సింహులు, టీచర్ కృష్ణయ్య, బంత్రోతు కృష్ణయ్య, తదితరులు ఉన్నారు.



సద్దునపల్లి కృష్ణ స్వామిని దర్శించుకున్న బండ్ల రాజశేఖర్ రెడ్డి దంపతులు

